నమస్తే తెలంగాణ
# వికారాబాద్
13 హైదరాబాద్, శనివారం 27 జనవరి 2024 | VIKARABAD









జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

త్యాగధనుల స్ఫూర్తిగా ప్రగతి మార్గాన పయనం

గణతంత్ర వేడుకల్లో రంగారెడ్డి, వికారాబాద్ కలెక్టర్లు శశాంక, నారాయణరెడ్డి

మువ్వన్నెల జెండా ఎగురవేత.. అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాల అందజేత

# అభివృద్ధిలో అగ్రస్థానం వైపు

రంగారెడ్డి, జనవరి 26 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తూ అధికారులు, ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం తో జిల్లాను ప్రగతిపథంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ శశాంక అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన 75వ భారత గణతంత్ర వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సాధించిన ప్రగతిపై ప్రసంగించారు. దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసిన మహనీయులను స్మరిస్తూ.. వారి ఆశయ సాధనకు తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగడంతోపాటు పే దల ఆకాంక్షను నెరవేరుస్తున్నదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ సేవలను అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. అభయ హస్తం కింద జిల్లా ప్రజల నుంచి 20,99,208 మంది నుంచి దరఖాస్తులను స్వీకరించి ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా కంప్యూటరీకరించినట్లు తెలిపారు. రైతు భరోసా పథకం కింద ఇప్పటివరకు 2,20,330 మంది రైతుల ఖాతాల్లో రూ.105కోట్ల 35 లక్షల ను జమ చేసినట్లు తెలిపారు.

**అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు..**

గణతంత్ర వేడుకల సందర్భంగా జిల్లా పరిషత్ గర్ల్స్ హైస్కూల్ (ఇబ్రహీం పట్నం), తెలంగాణ మాడల్ స్కూల్ (శంకర్‌పల్లి), శ్రీ గాయత్రి స్కూల్ (బడంగ్‌పేట), కేజీవీపీ ఆమనగల్లు, గవర్నమెంట్ చిల్డ్రన్ హోమ్ స్టూడెంట్స్ (మొయినాబాద్) చిన్నారులు దేశభక్తిని చాటేలా ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందజేశారు. గణతంత్ర వేడుకల్లో అదనపు కలెక్టర్లు ప్రతిమా సింగ్, భూపాల్‌రెడ్డి, డీఆర్వో సంగీత, మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, బడంగ్‌పేట మున్సిపాలిటీ మేయర్ చిగురింత పారిజాత తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ పట్టణంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో..

వికారాబాద్, జనవరి 26,(నమస్తే తెలంగాణ): జిల్లాలో 75వ గణతంత్ర దినోత్సవం ఘనంగా జరిగింది. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో కలెక్టర్ సి.నారాయణరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. వికారాబాద్ ప్రభుత్వ బాలికల పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొత్తగడి రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. 241 మంది ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. అదేవిధంగా బ్యాంకు లింకేజీ ద్వారా 539 స్వయం సహాయక సంఘాలకు రూ.28.74 కోట్ల చెక్కు, స్త్రీనిధి ద్వారా 331 స్వయం సహాయక సంఘాలకు రూ.6.20 కోట్ల చెక్కులను అందజేశారు. కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్, ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ కోటిరెడ్డి, జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీ సీఈవో జానకీరెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల్లో మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాలు అమల్లోకి వచ్చాయన్నారు. మహాలక్ష్మి పథకం కింద జిల్లాలో ఇప్పటివరకు 25,08,608 ఉచిత బస్సు టికెట్ల ద్వారా మహిళలు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణ సదుపాయాన్ని ఉపయోగించుకున్నారన్నారు. మరోవైపు రాష్ట్రంలోని పేదలందరికీ ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించాలనే ఉద్దేశంతో రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం పరిమితిని ప్రభుత్వం రూ.10 లక్షలకు పెంచిందన్నారు. ప్రజాపాలన అభయహస్తం గ్యారెంటీల కోసం జిల్లావ్యాప్తంగా 57 బృందాలతో 2,84,275 దరఖాస్తులను స్వీకరించడంతోపాటు ఆన్‌లైన్ చేశామన్నారు. రైతు భరోసా పథకంలో భాగంగా ఇప్పటివరకు 1,68,085 మంది రైతులకు రూ.95.48 కోట్లను అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎస్పీ కోటిరెడ్డి, అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యానాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ అమిత్‌నారాయణ్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బైండ్ల విజయ్‌కుమార్, వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక



రంగారెడ్డి కలెక్టరేట్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు..

## మహాలక్ష్మికే అధికం



రంగారెడ్డి జిల్లాలో అభయ హస్తం కింద **20,99,208 దరఖాస్తులు**

రూ.2,500 నగదుకు 4,56,839.. రూ.500 గ్యాస్ సిలిండర్‌కు 4,32,676 దరఖాస్తులు

రంగారెడ్డి, జనవరి 26(నమస్తే తెలంగాణ): ప్రజా పాలన అభయ హస్తం ఐదు పథకాల లబ్ధిదారులు ఎక్కువగా మహాలక్ష్మి పథకానికే దరఖాస్తు చేశారు. జిల్లావ్యాప్తంగా మహాలక్ష్మి కింద అందించే రూ.2,500 నగదు కోసం 4,56,839 మంది దరఖాస్తు చేశారు. మహాలక్ష్మి పథకంలోనే మరో పథకం రూ.500 గ్యాస్ సిలిండర్ కావాలని 4,32,676 మంది దరఖాస్తు చేశారు. ఐదు పథకాలకు మొత్తం 20,99,208 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం గత డిసెంబర్ 28 నుంచి ఈ ఏడాది జనవరి 6 వరకు ఐదు గ్యారెంటీ స్కీంలకు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. రంగారెడ్డి జిల్లాలో 21 మండలాల్లోని 558 గ్రామ పంచాయతీల పరిధిలో 2,46,626 కుటుంబాలు ఉన్నాయి. వీటి పరిధిలో నుంచి 2,95,060 కుటుంబాల నుంచి దరఖాస్తులు వచ్చాయి. అలాగే 16 మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో 2,88,361 కుటుంబాలు ఉండగా..2,14,789 కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి. వీటన్నింటికి ఆధార్, రేషన్ కార్డులను అనుసంధానం చేసి దరఖాస్తుల్లోని సమాచారాన్ని పోల్చి పథకాల దరఖాస్తులను ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో వేర్వేరుగా విభజించారు.

**పథకాల వారీగా దరఖాస్తులు ఇలా..**

| పథకం | దరఖాస్తులు |
|---|---|
| రూ.2,500 నగదు | 4,56,839 |
| రూ.500 సిలిండర్ | 4,32,676 |
| గృహజ్యోతి | 3,99,866 |
| చేయూత | 1,01,016 |
| రైతు భరోసా | 3,17,788 |
| ఇందిరమ్మ ఇండ్లు | 3,91,023 |

# విద్యుత్ ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి


ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

షాబాద్ మండలం చందనవెల్లిలో జున్నా సోలార్ పవర్ ప్యానెల్ ఉత్పత్తి ప్లాంటును ప్రారంభించిన డిప్యూటీ సీఎం

షాబాద్, జనవరి 26: రాష్ట్ర ప్రజల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రత్నామ్నాయ విద్యుత్ ఉత్పత్తికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లాలోని షాబాద్ మండలంలోని చందనవెల్లి పారిశ్రామిక వాడలో నూతనంగా ఏర్పాటు చేసిన జున్నా సోలార్ పవర్ ప్యానెల్ ఉత్పత్తి ప్లాంటును ఆయన ప్రారంభించారు. అనంతరం సోలార్ పవర్ ప్యానెల్ ఉత్పత్తి విధానం గురించి అక్కడ ఉన్న ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. సోలార్ ప్యానెల్ ఉత్పత్తికి సంబంధించి గ్లాస్ లోడింగ్,ల్యామినేటింగ్ ఫ్రేమింగ్, క్యూరింగ్ లైన్, క్లీనింగ్ సెక్షన్, ఐపోర్టు, ఫైనల్ ఈ.ఎల్ ప్రాసెస్ యూనిట్స్‌ను పరిశీలించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. 2030 సంవత్సరం నాటికి ప్రజలకు ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా ప్రత్యామ్నాయ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తామన్నారు. ప్రపంచంలో మానవజాతికి విద్యుత్ శక్తికి మధ్య విడదీయరాని బంధం ఏర్పడిందన్నారు. విద్యుత్ శక్తి వినియోగం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో డిమాండ్‌కు అనుగుణంగా ప్రత్యామ్నాయంగా విద్యుత్ ఉత్పత్తిని పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా సౌరశక్తి, పవనశక్తి, హైడెల్, చెత్త నుంచి తయారు చేసే విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ ప్రజల అవసరాలు తీర్చుతామని చెప్పారు.

### విద్యుత్ ఉత్పత్తిని పెంచుతాం..

ఇప్పుడున్న థర్మల్ విద్యుత్‌కు ప్రత్యామ్నాయ మార్గాలతో అధిక విద్యుత్ ఉత్పత్తిని పెంచుతామన్నారు. ప్రత్నామ్నాయ విద్యుత్‌ను దేశ ప్రజలకు అందించేందుకు దివంగత ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ వేసిన పునాదులు దేశవ్యాప్తంగా ప్రజల అవసరాలను తీరుస్తుందన్నారు. భవిష్యత్తు ప్రజల అవసరాలను తీర్చే విధంగా స్థాపించిన ఈ కంపెనీ వృద్ధి చెందాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆకాంక్షించారు. అంతకుముందు హైతాబాద్ చౌరస్తాలో కొద్దిసేపు ఆగిన భట్టి విక్రమార్కకు కాంగ్రెస్ నాయకులు గజమాలతో సత్కరించారు. అనంతరం పక్కనే ఉన్న భూనిర్వాసితులతో కొద్ది సేపు మాట్లాడారు. ఇక్కడ ఏర్పాటు చేస్తున్న కంపెనీల్లో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా కృషి చేస్తామని తెలిపారు. చందనవెల్లి గ్రామ సర్వే నంబర్ 190లో చేసిన భూసేకరణలో నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూస్తానని భూ నిర్వాసితులకు భరోసా ఇచ్చారు. స్థానికంగా ఏర్పాటు చేసిన పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, చేవెళ్ల ఆర్డీవో సాయిరాం, షాబాద్ తహసీల్దార్ చిన్నప్పలనాయుడు, విద్యుత్ శాఖ ఏడీ స్వామి, ఏఈ నరేందర్, సోలార్ పవర్ ప్యానెల్ ప్లాంట్ నిర్వాహకులు శేఖర్‌రెడ్డి, బస్విరెడ్డి, ఈదుల నరేందర్‌రెడ్డి, భీమవరపు అనిల్‌కుమార్‌రెడ్డి, దుర్గాప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, పీసీసీ రాష్ట్ర కార్యదర్శులు ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, పీసరి సురేందర్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ ఇంచార్జి పామెన భీంభరత్, మండల పార్టీ అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రవీందర్, ఎంపీటీసీలు జయమ్మ, ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.



షాబాద్ మండలం చందనవెల్లి పారిశ్రామిక వాడలో సోలార్ పరిశ్రమను ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

# వ్యర్థాలతో వెలుగులు..

**మరో నాలుగు డంపింగ్ యార్డులు**

వ్యర్థాల రీసైక్లింగ్‌తో విద్యుత్ ఉత్పత్తి

స్థలాలను పరిశీలిస్తున్న బల్దియా

జవహర్‌నగర్‌కు ప్రత్యామ్నాయంగా అడుగులు

సిటీబ్యూరో, జనవరి 26 (నమస్తే తెలంగాణ) : జవహర్‌నగర్ డంపింగ్ యార్డుపై పడుతున్న ఒత్తిడిని తగ్గించేందుకు మరో నాలుగు డంపింగ్ యార్డుల ఏర్పాటుకు జీహెచ్‌ఎంసీ కసరత్తు ప్రారంభించింది. జనావాసాలకు దూరంగా వీటిని ఏర్పాటు చేయాలని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటిస్తున్నారు. స్థలాలను పరిశీలిస్తున్నారు. స్థల సేకరణ ఒక్కటే కాకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పర్యావరణంగాపరంగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. వ్యర్థాల నుంచి విద్యుత్ తయారీ, కొత్తగా ఏర్పాటు చేసే డంపింగ్ యార్డులతో స్థానిక ప్రజలను ఒప్పించడం వంటి అంశాలపై దృష్టి పెట్టారు. జీహెచ్‌ఎంసీ ఇతర నగర పాలక సంస్థల నుంచి రోజువారీగా ప్రతిరోజూ సుమారు 7611 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. వీటిని నిల్వ ఉంచకుండా ట్రీట్‌మెంట్ డిస్పోజల్ చేసే ప్రక్రియకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. తడి చెత్త ద్వారా కంపోస్టు ఎరువు, బయో గ్యాస్, ప్లాస్టిక్ రీసైక్లింగ్ చేయడం, పొడి చెత్తలో కాలే గుణం గల వ్యర్థాలను పోగు చేసి.. విద్యుత్ తయారీకి వినియోగిస్తున్నారు. జవహర్‌నగర్‌తో పాటు కొత్తగా ఏర్పాటు చేసే డంపింగ్ యార్డు వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి.. టీఎస్‌ఎస్పీడీఎల్ సమన్వయంతో విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించనున్నట్లు అధికారులు తెలిపారు.

